క్లుప్తంగా

17 మంది వలంటీర్ల రాజీనామా



కర్లపాలెం: కర్లపాలెం మండలంలో సోమవారం గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఏట్రవారిపాలెం సచివాలయం పరిధిలో 6గురు, దమ్మనవారిపాలెం సచివాలయం పరిధిలో 4గురు, తుమ్మలపల్లి సచివాలయం పరిధిలో ముగ్గురు, యాజలి సచివాలయం పరిధిలో 4గురు వెరసి 17 మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో నేతా జీ తెలిపారు. రాజీనామా పత్రాలను తమకు అందజేయగా ఆమోదించినట్లు చెప్పారు.

మాట నిలుపుకునే నాయకుడు సీఎం వైఎస్ జగన్

కర్లపాలెం: ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన జగనన్నను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటు వేయాలని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ కోరారు. కర్లపాలెం మండలంలోని పాతనందాయపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో సోమవారం సాయంత్రం కోన వెంకట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల ప్రచార పత్రాలను అందజేశారు. పేద ప్రజలకు నేరుగా గడప వద్దకే సంక్షేమ పథకాలందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి బాపట్ల ఎమ్మెల్యేగా కోన రఘుపతిని గెలిపించుకోవాలని చెప్పారు. బాపట్లను జిల్లా చేసిన జగనన్నకు ఎమ్మెల్యేగా కోన రఘుపతిని, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించి కానుకగా ఇద్దామని కోన వెంకట్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పార్టీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి, పేరాల వెంకటసురేష్, షేక్ షంషీర్, ఆట్ల హరిబాబురెడ్డి, దేవరకొండ రమేష్, రవి, నాగరాజురెడ్డి, నాగిరెడ్డి, వీరారెడ్డి, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యనందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషుకుమారి తెలిపారు. మండలంలోని సర్రావారిపాలెం పంచాయతీ మర్రికట్టవలోని ఎం.శివపార్వతి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు సర్టిఫికెట్‌లు అందజేశారు. శేషుకుమారి మాట్లాడుతూ సరైన పౌష్టికాహారం అందించటం వలన చిన్నారులలో శారీరక, మానసిక ఎదుగుదల సక్రమంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



వేమూరు: భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్నపాటి గొడవ భార్య మృతికి కారణమైంది. పోలీసుల కథనం మేరకు వేమూరు మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన గాలి సుధన్సీ, భర్త కోటేశ్వరరావుల మధ్య చిన్నపాటి గొడవల కారణంగా ఆదివారం ఇంట్లో సుధన్సీ(28) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందింది. నగరం మండలంలోని సరిపూడి గ్రామానికి చెందిన గాలి సుధన్సీ తల్లి కనపర్తి సునీత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై జె రాజశేఖర్ తెలిపారు.మృతి చెందిన మహిళను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- భట్టిప్రోలులో ఎన్నికల ప్రచారం



భట్టిప్రోలు ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా, అన్ని వర్గాలకు మేలు చేసేదిగా ఉందని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు దళితవాడలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. వాస్తవానికి దగ్గరగా, పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో అబద్ధాలతో కూడుకున్నదని, వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో వాస్తవానికి దగ్గరగా ఉందన్నారు. గతంలో కూడా టీడీపీ మాయ మాటలను ప్రజలు నమ్మలేదని, ఇప్పుడు కూడా అదే రీతిలో ప్రజలు తీర్పు ప్రకటిస్తారని విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కొండా శివప్రసాదరెడ్డి (ఎస్పీ రెడ్డి), సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు గద్దె సుశీల, పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, అబ్దుల్ కరీమ్, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు జాలాది దయమ్మ, దారా చెన్నయ్య, గాడల్లి దాసు, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె అసెంబ్లీ బరిలో 14 మంది అభ్యర్థులు

- స్వతంత్రంగా ముగ్గురు అభ్యర్థులు
- అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఎన్నికల అధికారి

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికలలో కీలకమైన రెండవ ఘట్టం సోమవారంతో ముగిసింది. ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు నిలిచారు. గుర్తింపు పొందిన పార్టీల నుంచి 11 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు ఎన్నికల బరిలో ఉన్నారు. రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి 18 మంది అభ్యర్థుల నుంచి 35 సెట్ల నామినేషన్‌లు అందగా నామినేషన్‌ల పరిశీలనలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 15 మంది అభ్యర్థులలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన బొర్రా శ్రీనివాసరావు తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవటంతో బరిలో 14 మంది నిలిచారు. గుర్తింపు పొందిన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారి హెలా షారోన్ ఎన్నికల గుర్తులను కేటాయించారు.

అభ్యర్థుల పార్టీ గుర్తులివే

గుర్తింపు పొందిన పార్టీలతో పాటు ఎన్నికల బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థులకు సోమవారం సాయంత్రం ఎన్నికల గుర్తులను కేటాయించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ ఈవూరు గణేష్‌కు సీలింగ్ ఫ్యాన్, టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌కు సైకిల్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి డొక్కా శ్రీనివాసరావుకు ఏనుగు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావుకు హస్తం, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి అంగిరేకుల ఆదినారాయణకు గన్నా కిసాన్(చెరుకురైతు), జైభారత్ నేషన్ పార్టీ అభ్యర్థి అంద్రాజు రామారాజుకు బ్యాటరీ టార్చ్, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి దోవా రమేష్‌రాంజీకి కోటు, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థి మెరుగుపాల సదాశివరావుకు భాకా, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి బెల్లంకొండ సుబ్బారావుకు టెలివిజన్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థి షేక్ హసీనాకు నిచ్చెనలను కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్న కొక్కిలిగడ్డ రాంబాబుకు గ్యాస్ సిలెండర్, బొడ్డు నాగేశ్వరరావుకు చక్కి, మహ్మద్ ఖాసింకు బ్యాట్ గుర్తులను కేటాయించారు. మే13వ తేదీన జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సిబ్బందిని సమాయత్తం చేయటంతో పాటు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో హెలా షారోన్ చెప్పారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఏప్రిల్ 25 నాటికి తుది ఓటర్ల జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 2,27,232 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారని వివరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అమలు

- వేమూరు అసెంబ్లీ అభ్యర్థి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి
- భట్టిప్రోలులో మహిళలతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న వరికూటి సతీమణి లక్ష్మి

భట్టిప్రోలు: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి అన్నారు. సోమవారం భట్టిప్రోలులోని కొత్తపేటలో పద్మశాలీయ సంఘ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గతంలో చంద్రబాబు చేసిన పాలనకు, ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. ఎవరి హయాంలో మేలు జరిగిందో ఆలోచన చేసి ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్ చేసేవి, చేయగలిగిన హామీలు మాత్రమే ఇస్తారని.. చంద్రబాబులా మోసపూరిత వాగ్దానాలు చేయరన్నారు. 2019లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్తను, ఎంపీగా నందింగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు డి. చెన్నయ్య, డి. నాగమల్లేశ్వరరావు, టి. బాలాజి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ పంట

కొల్లూరు : వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తున్న సీఎం జగనన్న పాలనలో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తుందని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు తనయుడు శ్రీతేజస్, ఆయన సతీమణి లక్ష్మి అన్నారు. సోమవారం రాత్రి కొల్లూరు శివారు గాంధీనగర్, బోసనగర్, కేటీ కాలనీల్లో శ్రీతేజస్ ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన సతీమణి లక్ష్మి మండలంలోని బొద్దులూరుపాడులో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లను తిరుగులేని ఆధిక్యంతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు గుర్రం మురళి, గొల్లపూడి వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు బావిరెడ్డి వెంకట్రామయ్య, వైస్ సర్పంచ్ సుకన్య, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ వెలివల రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు తోట రామలింగేశ్వరరావు, సుగ్గున మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బిట్రగుంట సత్యనారాయణ, కనకదుర్గ, ఉప్పు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని ఆందోళన



రేపల్లె-పేటేరు రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న 28వ వార్డు నివాసులు

రేపల్లె రూరల్: మున్సిపల్ శాఖ అధికారులు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ పట్టణంలోని 28వ వార్డు నివాసులు సోమవారం ఉదయం ఖాళీ డ్రమ్ములతో రేపల్లె-పేటేరు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. వేసవి ప్రారంభమైన నాటి నుంచి కుళాయిల ద్వారా మున్సిపల్ తాగునీరు సక్రమంగా సరఫరా కావటంలేదన్నారు. సమస్యను మున్సిపల్ అధికారులకు తెలియజేసినా స్పందించటం లేదని ఆరోపించారు. మున్సిపల్ అధికారులను నీటి సరఫరాపై ఎప్పుడు అడిగినా మోటార్లు చెడిపోయాయని చెప్పటం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అరగంటకు పైగా రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేయటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ ఏఈ రోహిణి సంఘటనా స్థలానికి చేరుకుని వార్డు వాసులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ప్రస్తుతం కాల్వలకు నీరు సమృద్ధిగా వస్తోందని, తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డులకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపండి

చెరుకుపల్లి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ముందుగా శాఖల వారీగా మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో విడివిడిగా సమీక్షించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా మంచినీటి ట్యాంకులు, విద్యుత్ మోటార్లు, తాగునీటి కుళాయిల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ట్యాంకుల్లో మంచి నీరు నింపే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో పీహెచ్‌సీల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి



భట్టిప్రోలు: కొత్తగా నిర్మించుకున్న ఇంటికి వాటర్ క్యూరింగ్ చేస్తూ ప్రమాదవశాత్తూ ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన స్థానికంగా చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భట్టిప్రోలు దళితవాడకు చెందిన కట్టుపల్లి ప్రేమ్‌చంద్ (29) స్థానిక జగనన్న కాలనీలో గృహాన్ని నిర్మించుకున్నాడు. సోమవారం ఉదయం గృహానికి వాటర్ క్యూరింగ్ చేసే క్రమంలో భాగంగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడు డాబా పై నుంచి కిందికి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడికి వివాహం కాలేదు. తల్లి, సోదరుడు, ఇరువురు సోదరిలు ఉన్నారు. ప్రేమ్‌చంద్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం మేరకు భట్టిప్రోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో చదువులు కొనసాగించాలి



చెరుకుపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో ఒక ప్రణాళికా బద్ధంగా చదివితే వారు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని గీతం విద్యాసంస్థల డైరక్టర్ సీహెచ్ఏ రామరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు గీతం ప్రతిభా పురస్కార అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గీతం కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. మండలంలో మొదటి స్థానం సాధించిన పి గాయిత్రీ దేవి 974/1000 మార్కులు సాధించినందుకు గానూ ఘనంగా సత్కరించారు. అదే కళాశాలలో సబ్జెక్టుల వారీగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సైతం సత్కరించారు. అనంతరం చెరుకుపల్లి, కర్లపాలెం, పిట్లవానిపాలెం, నిజాంపట్నం, నగరం, అమర్తలూరు, భట్టిప్రోలు మండలాలలోని పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 145 మంది విద్యార్థినీ విద్యార్థులకు, ఆయా పాఠశాలల హెచ్ఎంలకు గీతం జూనియర్ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి, ప్రిన్సిపాల్ బొర్రు శ్రీనివాసరావు, ఏడు మండలాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హెలా షారోన్

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు అధికారులతో సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థుల సహకారంతో నామినేషన్‌ల స్వీకరణ, ఉపసంహరణ కార్యక్రమాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించామన్నారు. అదేవిధంగా ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాలను కోడ్ ఉల్లంఘన జరగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావునివ్వకుండా చేసుకోవాలని సూచించారు. గుడులు, చర్చిలు, మసీదులు, వైద్యశాలల సమీపంలో ప్రచారాలు నిర్వహించరాదన్నారు. కులాలు, మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదన్నారు. అభ్యర్థుల ప్రచారాలు, ఖర్చులపై తమ ప్రత్యేక టీమ్‌లు పరిశీలిస్తున్నాయన్నారు. నిర్ణీత ఎన్నికల తేదీకి 48 గంటల ముందు తమ ప్రచారాలను నిలుపుదల చేయాలన్నారు. అభ్యర్థులు, తమ శ్రేణులు ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావునివ్వకుండా జరిగేలా సహకరించాలని చెప్పారు. పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో అభ్యర్థులు, ఏజెంట్లు పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చొప్పా రవీంద్ర పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో సొంతింటి కల సాకారం

- అమరావతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 53 వేల ఇళ్ల స్థలాలు పంపిణీ
- ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబు పేదల విరోధిగా చరిత్రలో నిలిచిపోతారు
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్



పెదపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో నందిగం సురేష్, వరికూటి అశోక్‌బాబు

పెదపూడి(వేమూరు): అమరావతి రాజధానిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుండా చంద్రబాబు అడ్డుకున్నారని బాపట్ల వైఎస్సార్ సీపీ పార్లమెంటు అభ్యర్థి నందిగం సురేష్ అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి, మూల్పూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. ఇళ్లు కూడా నిర్మించడం జరిగిందని చెప్పారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే అర్హత గల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. అమరావతి రాజధానిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 53 వేల ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఇంగ్లీషు మీడియంలో చదువు కోవడం చంద్రబాబుకు ఇష్టంలేక కోర్టుకు వెళ్లి నిలిపి వేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కొండ శివ ప్రసాద్ రెడ్డి, యలవర్తి సురేష్, గ్రామ సర్పంచ్ పెదపూడి ఆనంద్‌బాబు, మూల్పూరు జయ శ్రీ., ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జెడ్పీటీసీ మూల్పూరు లావణ్య, ఎంపీటీసీ తెనాలి పవన్ కల్యాణ్, కాకర్లమూడి అనుషా, వుయ్యూరి అప్పిరెడ్డి, అంబటి రామోహనరావు, చదలవాడ రమేష్, మూల్పూరు ప్రతాప్, కూచిపూడి వీరయ్య, మూల్పూరు సీతయ్య, మూల్పూరు సాగర్, సర్పంచ్ దేవర కొండ రాము, టి శాంతి కుమారి, కాకర్ల మూడి భాగ్యరావు, కూచిపూడి భూపతి, యాజల వెంకటేశ్వర్లు, కొండమబూది శ్యామ్, చొప్పర సుధాకర్, షేక్ ఖాదర్ వల్లీ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచండి

- జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



వెదుళ్లపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్లటౌన్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం బాపట్ల మండలంలోని వెదుళ్లపల్లి చెక్‌పోస్ట్‌తో పాటు స్టువార్టుపురంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపై వెదుళ్లపల్లి ఎస్సైకి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు నగదు, మద్యం, బహుమతులు, ఇతర వస్తువులను ఆశగా చూపి ప్రజలను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉంటుందన్నారు. చెక్ పోస్ట్‌ల్లో వాహన తనిఖీలు నిర్వహించే సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా తరలించే నగదు, మద్యం, ఇతర వస్తువులను కట్టడి చెయ్యాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన స్టువార్టుపురంలోని సాల్వేషన్ ఆర్మీ ఎలిమెంటరీ స్కూల్, బేతపూడిలోని గ్రంథాలయం, వృక్షనగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ ప్రహరీ గోడలు సరిగా లేని ప్రదేశాల్లో పటిష్టమైన బ్యారికేటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రత చర్యల తీసుకోవాలన్నారు. వెదుళ్లపల్లి ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు



టీడీపీ కార్యకర్తలకు కండువాలు కప్పుతున్న అశోక్‌బాబు



జనసేన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పుతున్న అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అమర్తలూరు మండలంలోని కూచిపూడి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సముచితం స్థానం కల్పించడం జరుగుతుందని అశోక్‌బాబు చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు కొక్కిల గడ్డ ఆకాశ్, యడాలి సాయి, కేసాని పవన్ సాయి, నామ్ గడ్డ సూర్య తదితరులు పాల్గొన్నారు.

జనసేనను వీడి వైఎస్సార్ సీపీలోకి..

కూచిపూడి(వేమూరు): కొల్లూరు మండలంలోని గాజులంక గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు కూచిపూడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగాం సురేష్, నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో లబ్ధి పొంది వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందని తెలిపారు. జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని అశోక్‌బాబు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: రేపల్లె నుంచి గంగడిపాలెం సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె పట్టణం, మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, మండలంలోని వివిధ గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.